రోడ్డుపాల్జేస్తున్నారు..



కోర్టు ఆదేశాలతో ఏర్పాటు చేసుకున్న బండి

- తోపుడుబండ్ల వ్యాపారుల ఆవేదన
- కార్పొరేటర్ ఒత్తిడితోనే అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ



జీవీఎంసీ అధికారులకు కోర్టు ఆదేశాలను వివరిస్తున్న న్యాయవాది శ్రీరామ్మూర్తి



రోడ్డుపై ఏర్పాటు చేసిన తోపుడుబండి

బీచ్‌రోడ్డు: ఏళ్ల తరబడి తోపుడు బళ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తమను రోడ్డు పాల్జేస్తున్నారని తోపుడుబండ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసుకోవచ్చని కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నా అధికారులు అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. తమ వ్యాపారాలు సజావుగా జరిగేలా చూడాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. జీవీఎంసీ 22వ వార్డులో చిరు వ్యాపారాలను తొలగించాలని స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హైకోర్టులో పిల్ వేశారు. 2014 స్ట్రీట్ వెండార్స్ యాక్ట్‌కు లోబడి రోడ్డు మార్జిన్ దాటిన ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు గతేడాది నవంబరు 16న ఆదేశాలు జారీ చేసింది. దీంతో వార్డులోని చిరు వ్యాపారుల దుకాణాలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. అయితే తాము తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఎక్కడా ఆక్రమణలకు పాల్పడలేదంటూ 30 మంది తోపుడుబండ్ల వ్యాపారులు కోర్టును ఆశ్రయించడంతో, కింద కోర్టులో తేల్చుకోవాల్సిందిగా హైకోర్టు సూచించింది. దీంతో వారు స్థానిక రెంట్ కంట్రోలర్ కమ్ 4వ అడిషనల్ కోర్టును ఆశ్రయించారు. జీవీఎంసీ అధికారులు, బాధితుల వాదన విన్న కోర్టు గత నెల 25వ తేదీన స్టేటస్ కో ఆర్డర్‌ను జారీ చేసింది. గతంలో మాదిరిగా వ్యాపారాలు చేసుకోవచ్చని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి విచారణకు జనవరి 31వ తేదీకి వాయిదా వేయగా, ఆ రోజు జీవీఎంసీ అధికారులు హాజరు కాకపోవడంతో కేసును మార్చి 8వ తేదీకి వాయిదా వేశారు.

తొలగించాలని ఒత్తిడి

కోర్టు ఆదేశాల ప్రకారం తోపుడు బండ్ల వ్యాపారులు తిరిగి వ్యాపారాలు చేసుకునేందుకు ఆదివారం ఉదయం ప్రయత్నించగా, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది షాపులను తొలగించాలంటూ వారిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తమపై కక్ష సాధించేందుకే కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకుండా అధికారులు వేధిస్తున్నారని చిరు వ్యాపారాలు నిరసనకు దిగారు. న్యాయవాది వచ్చి కోర్టు ఆదేశాలు చూపడంతో అధికారులు తిరిగి వెళ్లిపోయారు. కార్పొరేటర్ బెదిరింపులతో తమకు అన్యాయం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంపై ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

అధికారులను కార్పొరేటర్ బెదిరిస్తున్నారు

4వ అడిషనల్ సివిల్ కోర్టు ఇచ్చిన స్టేటస్ కో ను అమలు చేయకుండా జోనల్ కమిషనర్‌ను, టౌన్ ప్లానింగ్ అధికారులను కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ బెదిరిస్తున్నాడని చిరు వ్యాపారుల తరపు న్యాయవాది శ్రీరామూర్తి ఆరోపించారు. ఆదివారం తోపుడు బండ్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న అధికారుల వద్దకు ఆయన చేరుకొని కోర్టు ఆదేశాలను చూపించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆర్డర్ డిస్మిస్ అయిందని, ప్రస్తుతం జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను అధికారులు తుచ తప్పకుండా పాటించాలని తెలిపారు. అలా కాకుండా కార్పొరేటర్ బెదిరింపులకు భయపడి షాపులను తొలగిస్తే కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కోర్టు అదేశాలు చిరు వ్యాపారులకే కాదు, స్థానికులకు కూడా భారీ ఊరట అని న్యాయవాది తెలిపారు.

అధికారులు వేధిస్తున్నారు



ఎన్నో ఏళ్లగా తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటున్నాం. ఓ వ్యక్తి బెదిరింపులకు భయపడి జీవీఎంసీ అధికారులు మమ్మల్ని వేధిస్తున్నారు. కోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చినా.. తోపుడు బండ్లు తొలగించాలని సచివాలయం సిబ్బంది, జీవీఎంసీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మాకు న్యాయం చేయాలి.

– ఈశ్వరరావు, అధ్యక్షుడు, కళాభారతి తోపుడుబండ్ల సంఘం

30 ఏళ్లుగా వ్యాపారం



ఇదే ప్రాంతంలో 30 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్నాం. మా కుటుంబానికి ఇదే ఆధారం. మాపై కక్ష సాధించేందుకే ఇలా రోడ్డు మీదకు లాగేస్తున్నారు. మూడు నెలలుగా వ్యాపారం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మాకు కోర్టు ఆదేశాలు ఎంతో ఊరటనిచ్చాయి. అయినా సరే అధికారులు మమ్మల్ని వేధిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి న్యాయం చేయాలి.

– నిషా, చిరు వ్యాపారి

క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు మేలు



మాట్లాడుతున్న పరశురామరాజు

ఎంవీపీకాలనీ: కేంద్ర బడ్జెట్ సామాన్యుడి అభ్యున్నతికి రాచ బాటలు వేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పేర్కొన్నారు. ఆదివారం లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాలను సంతృప్తిపరిచే విధంగా ఉందన్నారు. తక్కువ ఖర్చుతో వైద్యం, విద్య అందించడంతో పాటు యువతను నైపుణ్యవంతులుగా చేసేందుకు చేసిన కేటాయింపులు అభినందనీయమన్నారు.

5 నుంచి తెలుగు సినిమా ఫిల్మ్ ఫెస్టివల్

మద్దిలపాలెం: తెలుగు సినిమా ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఈనెల 5 నుంచి 7 వరకూ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధి ప్రకాశరావు తెలిపారు. భక్త ప్రహ్లాద (తొలి పూర్తి నిడివి చిత్రం) 1932, ఫిబ్రవరి 6న విడుదలైన సందర్భంగా తెలుగు సినిమా దినోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. 5 తేదీ నుంచి 7వ తేదీ వరకూ ప్రతి రోజూ సాయంత్ర 5.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఫెస్టివల్‌లో 5న రైతు బిడ్డ, 6న ఒక ఊరి కథ(1978), 7న నా ఆటోగ్రాఫ్ (2004) సినిమాలను ప్రదర్శిస్తామన్నారు. ఫెస్టివల్‌కు అధ్యక్షుడిగా ఎ.కాశీవిశ్వేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు.

టెన్నిస్‌లో రాగహర్షిణి, పరిణతి విజేతలు

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా సీనియర్ టెన్నిస్ సంఘం (ఐస్టా) ఆధ్వర్యంలో వెటరన్, చిన్నారులకు నిర్వహించిన పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు మాజీ డీజీపీ సాంబశివరావు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలపై చిన్నారులకు తల్లిదండ్రులు ఆసక్తి కలిగించాలన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానిక క్లబ్‌ల్లో 35+నుంచి 70+ వరకు ఐదు కేటగిరీలతో పాటు చిన్నారులకు అండర్ 12,14 కేటగిరీలో పోటీలు నిర్వహించారు. అండర్ 12 బాలికల టైటిల్ పోరులో రాగహర్షిణి 8–5 తేడాతో సుదీక్షపై విజయం సాధించింది. అండర్ 14 బాలికల ఫైనల్స్‌లో వి.పరిణతి 8–2తో సేవితపై విజయం సాధించింది. అండర్ 12 బాలుర విభాగంలో రేవంత్ రుషి విజేతగా నిలిచాడు. ఆఫీసర్స్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో టోర్నీ డైరక్టర్ సతీష్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌చంద్, కార్యదర్శి డీఎస్ఎన్ రాజు, చిన్నారుల టోర్నీ పర్యవేక్షకుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

పిల్లలకు బాల వికాస్ పరీక్షలు

భీమునిపట్నం: భీమిలిలోని సత్యసాయి సమితిలో ఆదివారం బాల వికాస్ పరీక్షలు జరిగాయి. సమితి కన్వీనర్ మొల్లి సూర్య సన్యాసిరావు మాట్లాడుతూ పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడంలో భాగంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎలా ఉండాలి, పెద్దలు, తల్లితండ్రులు, గురువుల పట్ల గౌరవ మర్యాదలతో ఎలా మెలగాలి అన్న విషయాలపై పిల్లలకు ప్రత్యేకంగా తరగతులు నిర్వహించి, అనంతరం ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇక్కడ భీమిలి పరిధిలోని 85మంది పరీక్షలు రాస్తున్నారని, ఇది వారికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలవికాస్ కో–ఆర్డినేటర్ బగ్గం సతీష్, చిట్టివలస సమితి కన్వీనర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మీదే..



ప్రసంగిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు

కొమ్మాది: ఒత్తిడిని జయిస్తే విజయం సొంతవమవుతుందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు అన్నారు. రుషికొండలోని డా.బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ భవన్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు నిర్వహించిన ప్రేరణ సదస్సులో ఆయన మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురై, ఒత్తిడికి లోనవుతారని దీనివలన ఏకాగ్రత లోపిస్తుందని పేర్కొన్నారు. ఒత్తిడిని దూరం చేస్తేనే, ప్రశాంతంగా చదవగలరని తెలిపారు. ఏకాగ్రత, సమయపాలన తదితర అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్, ఆంధ్ర యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఎం.వి.రాజు పాల్గొన్నారు.


శివాజీపార్క్‌లో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ మహాసభ



నూతన కమిటీ సభ్యులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డు శివాజీ పార్క్‌లో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (వీసీసీ) మద్దిలపాలెం జోన్ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలు, పెద్దల నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం వీసీసీ జిల్లా కన్వీనర్ కె.సుశీల మాట్లాడుతూ పిల్లలు ఈ ప్రపంచంలో అత్యంత విలువైన వారు అన్నారు. ఈ నాటి బాలలే రేపు దేశాభివృద్ధిలో కీలకంగా నిలిచే పౌరులన్నారు. ఈ నేపథ్యంలో బాలలను పెద్ద ఎత్తున సమాయత్తం చేసి ఈ క్లబ్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్దిలపాలెం జోన్ పరిధిలో 9 క్లబ్‌లు ఉండగా మూడేళ్లకోసారి ఇలాంటి మహాసభ నిర్వహించి కొత్త కమిటీలను నియమిస్తున్నామన్నారు. అనంతరం డి.నీలవేణి మహాసభ రిపోర్ట్‌ను విడుదల చేశారు. పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాడు అద్భుతం.. నేడు శిథిలం



ఎర్రని, తెల్లని రంగుల రంగులతో కనిపించే బీచ్ రోడ్డులోని ఈస్ట్ పాయింట్ లైట్ హౌస్ ఒకప్పుడు చాలా ఫేమస్..ఇప్పుడిప్పుడే దీని ఆనవాళ్లు కోల్పోతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు చాలా సినిమా షూటింగులు ఈ లైట్ హౌస్ వద్దే జరిగేవి. బాలీవుడ్, టాలీవుడ్ సినిమాలతో పాటు ఇతర ప్రాంతీయ భాషల సినిమాలు, షార్ట్‌ఫిల్మ్‌లలో ఇది కనిపిస్తుంది. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న లైట్ హౌస్ నిరాదారణకు గురవుతోంది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అయ్యన్న అనుచిత వ్యాఖ్యలపై కూటమి వైఖరి తెలపాలి



డాక్టర్ మధుకుమార్

ఎంవీపీకాలనీ: రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు గిరిజన చట్టాలు రద్దు చేయాలంటూ ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వం తన వైఖరి తెలియజేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకుమార్ డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం విఘాతంగా ఉందంటూ, ప్రభుత్వం సవరించాలంటూ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలపై గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అయ్యన్న వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 1/70 చట్టం గిరిజనకు రక్షణగా ఉందన్నారు. దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాలు, సంపదను కాపాడడంలో ఈ చట్టం పాత్ర కీలకమన్నారు. ఇలాంటి చట్టాన్ని తొలగించడమో, సవరించడమో చేస్తే ఏజెన్సీ ప్రాంతాలతో పాటు గిరిజనుల రక్షణ ప్రశ్నార్థమవుతుందన్నారు.

అలరించిన త్యాగరాజ పంచరత్న సేవ

సీతంపేట: కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో స్థానిక బీవీకే కళాశాలలో శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం పంచరత్నాకర సేవ జరిగింది. పలువురు గాయనీమణులు పాల్గొని త్యాగరాజ స్వామి కృతి పర్చిన జగదానంద కారక, దుడుకు గల , సాధించెనే, కనకన రుచిరా, ఎందరో మహానుభావులు కీర్తనలు ఆలపించి త్యాగరాజ స్వామికి సంగీత సేవ నిర్వహించారు. సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన గాయకుడు శ్రీరామ్ జొన్నల గడ్డ ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అలరించాయి. ఈ సందర్భంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహించిన త్యాగరాజ కీర్తనల పోటీలో సుమారు 250 మంది పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకులు నిష్ఠల కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు, బీవీకే చైర్మన్ ఆచార్య జి. నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కోడ్ విగ్రహాలకేనా.. ఫ్లెక్సీలకు లేదా?



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు



ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద తొలగించని కూటమి నాయకుల ఫ్లెక్సీలు

ఆరిలోవ: ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నగరంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఇందులో భాగంగా రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేశారు. కానీ కొన్నిచోట్ల కూటమి పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం జీవీఎంసీ అధికారులు, సిబ్బంది తొలగించకుండా వదిలేశారు. జీవీఎంసీ 13 వార్డు పరిధి ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, ఇటీవల ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగ విగ్రహాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ముసుగులు వేశారు. అక్కడే ఉన్న పెద్ద సైజు ఫ్లెక్సీలను మాత్రం తొలగించకుండా విడిచిపెట్టేశారు.

సండే సందడి



కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాల వద్ద సందర్శకులు



ఐ లవ్ కైలాసగిరి బోర్డు వద్ద సందర్శకులు



ఎయిర్ సైక్లింగ్ చేస్తున్న యువతి

ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరి ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. ఘాట్ రోడ్డులో వాహనాలు, అప్పుఘర్, హనుమంతవాక వైపు మెట్ల మార్గాలతో పాటు రోప్‌వే ద్వారా వేల మంది పర్యాటకులు రావడంతో సందడి నెలకొంది. శివపార్వతుల విగ్రహాలు, వ్యూ పాయింట్, ఐ లవ్ కైలాసగిరి పాయింట్ వద్ద గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. ఎయిర్ సైక్లింగ్, జిప్ లైనర్ వద్ద ఉత్సాహంగా గడిపారు. అయితే విశాఖ దర్శన్ టాయ్ ట్రైన్ (సర్క్యూట్ ట్రైన్) పాడవడంతో సందర్శకులు నిరాశ చెందారు. త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. – ఆరిలోవ

బీచ్ పీఛే.. ఖేల్ ఆగే.!





ఆటుపోట్ల కారణంగా.. సముద్రుడు చిన్నబోయాడు. అలల ఘోషతో గర్జించే సముద్రం ఒక్కసారిగా 50 మీటర్ల మేర లోపలికి వెళ్లిపోయింది. గల్లీ క్రికెట్ ఆడే యువతకు సాగరతీరం భారీ మైదానంలా మారిపోయింది. అంతే.. పెదజాలారిపేట తీరంలో అరే భాయ్.. బీచ్ పీఛే.. ఖేల్ ఆగే అంటూ క్రికెట్ ఆడుతూ ఎంజాయ్ చేస్తుండగా సాక్షి క్లిక్‌మనిపించింది.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకునే వరకు పోరాటం



జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షకు జగదాంబ జోన్ కమిటీ కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఒక వ్యక్తికి సంబంధించినది గాని ఒక సంస్థకు సంబంధించినది గానీ కాదన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో ఇది వచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ఎన్నికలు తప్ప ప్రజల సంక్షేమం పట్టదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌ని చూస్తే తేటతెల్లమవుతుందని అన్నారు. ఆనాడు రైతులు నల్ల చట్టాలు రద్దు చేయాలంటూ పోరాటం చేసినా, 700 మందికి పైగా రైతులు అసువులు బాసినా పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు సమీపించేసరికి సాక్షాత్ ప్రధాని మోదీ బహిరంగంగా రైతులకు క్షమాపణ చెప్పి నల్ల చట్టాలను రద్దు చేశారని అన్నారు. ఢిల్లీ ఎన్నికల నేపథ్యంలో మధ్య తరగతికి మేలు చేసే బడ్జెట్‌గా ఈ బడ్జెట్ ను అభివర్ణిస్తూ ఢిల్లీ గద్దె లక్ష్యంగా ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గత బడ్జెట్ తో పోల్చుకుంటే ఈ బడ్జెట్ 5 శాతం పెంచి ప్రవేశపెట్టినప్పటికీ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధి, యూరియా సబ్సిడీలపై బడ్జెట్‌లో కోతలు విధించడం బీజేపీ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక నైజాన్ని బట్టబయలు చేస్తున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పాగా వేసేందుకు ఎన్ని కుయుక్తులు పన్నినా విఫలం కావడంతో స్టీల్‌ప్లాంట్‌కి అరకొర నిధులు విదిలించి మోసం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించడం వంటి కార్యక్రమాలు నిర్వహించకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు వై. రాజు, ప్రొఫెసర్ సూరప్పుడు, సంతోష్, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదకరంగా రోడ్డు అంచులు



విశాలాక్షినగర్‌లో కైలాసగిరి బస్ స్టాప్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు అంచు

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరికి వెళ్లే ఘాట్ రోడ్డు అంచులు పలుచోట్ల ప్రమాదకరంగా మారాయి. వర్షాకాలంలో వరద నీరు రోడ్డపై నుంచి అంచుల్లో ప్రవహించడంతో కాలువల మాదిరిగా మారాయి. అంచుల వద్ద సుమారు అడుగు నుంచి అడుగున్నర లోతు ఉండటంతో వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. కై లాసగిరి పైనుంచి కిందకు వచ్చినప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి అదుపు తప్పి ఈ గోతుల్లో పడుతున్నారు. కై లాసగిరి కూడలి వద్ద కొండపైకి వెళ్లే బస్ స్టాప్ సమీపంలో మరింత ప్రమాదకరంగా ఉంది. కోతకు గురైన రోడ్డు అంచులను మట్టితో పూడ్చి ప్రమాదాలు నివారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఉత్సాహంగా కళావేదిక వార్షికోత్సవం



జ్ఞాపికలతో స్కేటింగ్ విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ బీవీకే కళాశాలలో ఆదివారం ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళావేదిక వార్షికోత్సం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏయూ పూర్వ ఉపకులపతి అచార్య జి.నాగేశ్వరరావు, ప్రత్యేక అతిథిగా లెండీ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ కె.శివరామకృష్ణ పాల్గొన్నారు. ఉత్సవాలు సందర్భంగా అతిథులతో పాటు పలు మీడియా సంస్థల ప్రతినిధులు, ఇటీవల తమిళనాడులో జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌సిప్‌లో పాల్గొన్న విద్యార్థులను సత్కరించారు.కార్యక్రమంలో కళావేదిక సంస్థ నిర్వాహకులు కమల్ బైద్, బి.రజనీ పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించిన విద్యార్థులు



పార్కులో విద్యార్థులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్ ఆదివారం విద్యార్థులతో కళకళలాడింది. నగరంలోని రెండు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పార్కును సందర్శించారు. పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి విద్యార్థులకు వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం తదితర అంశాల గురించి తెలియజేశారు.

ఉత్సాహంగా నడక పోటీలు

మురళీనగర్ : వాకర్స్ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నడక పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను 41–50, 51–60, 61–70, 70 ఆపైన వయసు కలిగిన పురుషులు, మహిళలకు నిర్వహించారు.